

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 14 | సంచిక : 06 | మే 2009



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


చించినాడ ...... 23-02-2009

గణపవరం ...... 20-02-2009

పాలమూరు .... 28-02-2009



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-02-2009, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు బయట కనిపించేది అంతా భ్రాంతే. చివరకు ఈ భ్రాంతి మనకు దుఃఖాన్ని, అశాంతిని తీసుకొని వస్తుంది. ఒక్క ఆత్మజ్ఞానం తప్పించి ఏదీ దుఃఖంలేని స్థితికి తీసుకొనివెళ్ళలేదు. మీకు పెద్ద సామ్రాజ్యం ఉన్నా అది మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళలేదు. జ్ఞానంవలన శాంతి వస్తుంది, సుఖం వస్తుంది, అజ్ఞానం వలన అశాంతి, దుఃఖం వస్తాయి. మనిషి ఏదైనా పొరపాటు చేస్తే అది అజ్ఞానంలో ఉన్నప్పుడు చేస్తాడు కాని జ్ఞానంలో చెయ్యడు. మనం ఒక రూపానికి, నామానికి పరిమితమై ఉన్నాము అందుచేత మన హృదయంలో సత్యం ఉన్నా దానిని మనం అంగీకరించలేకపోతున్నాము. మన మనస్సు సత్యాన్ని అంగీకరించదు, దానికి కారణం సత్యం లేకపోవటం వలన కాదు, మన మనస్సులో ఉన్న దోషాలు సత్యాన్ని అంగీకరింపచేయవు. మీరు పూజలు చేయండి, జపాలు చేయండి, సత్సంగాలు చేయండి ఈ సాధనలు అన్నీ ఎందుకు అంటే మన మనస్సును పవిత్రం చేసుకోవటానికే. నీటితో మన శరీరాన్ని ఎలా శుభ్రం చేసుకొంటామో అలాగ భక్తి అనే గంగలో మన మనస్సును పవిత్రం చేసుకోవాలి. మనకు బాహ్యంగా ఎన్ని ఉన్నా మన మనస్సు శుభ్రంగా లేకపోతే, మన బుద్ధి సరిగా లేకపోతే వాటి వలన ప్రయోజనం లేదు. మన బుద్ధిని బాగుచేసుకొందాము అనే ప్రయత్నం మనకు లేదు. పూర్వం ఏమీ ప్రయత్నం చేయలేదు కనీసం ఇప్పుడైనా ప్రయత్నం ప్రారంబించాలి అనే సంకల్పం కూడా మనకు రావటంలేదు. మనం పూర్వజన్మలో పుణ్యకర్మ చేసి ఉండకపోతే మన మొఖం ఈశ్వరుడి వైపుకు తిరగదు. చిత్తశుద్ధి లేని శివపూజలేలయా అన్నాడు వేమన. ఏదో లాంచనానికి చేయటం

ఎందుకు? నీ చిత్తాన్ని బాగుచేసుకోవటానికి నువ్వు ఏమీ చేయటంలేదు. కొంతమంది మంచి పనులు చేసినా ఏదో గౌరవం ఆశించి చేస్తారు కాని భగవంతుని దయను సంపాదించుకోవటానికి మటుకు ఆ పనులు చేయరు. చిత్తశుద్ధిలేని మాటల వలన, చిత్తశుద్ధిలేని పనుల వలన ఏమీ ప్రయోజనం లేదు. మీరు చేసే పనులను భగవంతుడు చూడడు, ఆ పనులు చేసేటప్పుడు మీ తలంపును ఆయన చూస్తాడు.

సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. అదే బ్రహ్మం, అదే శాంతి, అదే ఆనందం. ద్వైతం అంటే రెండు ఉన్నది, అద్వైతం అంటే రెండవది అంటూ ఏమీలేదు, ఉన్నది ఒక్కటే. ఒక వస్తువుగాని, ఒక వ్యక్తిగాని ఏదైనా నీకు భిన్నంగా కనిపించినప్పడు దానిమీద నీకు కోరిక కలుగుతుంది. ఆ బంగారం నాకుకావాలి, ఆ పొలం నాకుకావాలి అని నీకు అనిపిస్తుంది. అంతా తానే అనుకొన్నప్పడు ఇంక నీకు కోరిక రాదు, ద్వైతం ఉన్నంతసేపు కోరిక రాకుండా మనం ఆపుచేయలేము. ద్వైతంలో శాంతిలేదు, సుఖంలేదు. నీవు వేరు, నేను వేరు అనే భేదబుద్ధి ఉన్నంతకాలం జన్మలు వచ్చితీరుతాయి, ఎవరూ ఆపుచేయలేరు. అబేధస్థితిని పొందితే ఇంక వాడికి కోరిక లేదు, భయం లేదు. ఆత్మజ్ఞానం పొందాలంటే ముందు మనస్సును బాగుచేసు కోవాలి. శరీరానికి ఇచ్చే విలువ మనం మనస్సుకు ఇవ్వటంలేదు. ఈ సబ్జక్టు వినటం వలన ముందు మీ మానసికఆరోగ్యం బాగుపడుతుంది. మన మనస్సు బురదగుంటకింద ఉన్నా పైకి గంగా నదిలా ఇతరులకు కనబడాలి అనుకుంటాము. మీరు రోడ్డుమీద వెళుతూ ఉంటే బురద గుంటలు చూస్తారు. అంతకంటే పెద్దబురదగుంటలు మన మనస్సులో ఉన్నాయన్న సంగతి మనకు తెలియటంలేదు. మనస్సును బాగుచేసుకోవటానికి శ్రవణం ఒక ప్రక్రియ. భగవంతుడి మాటలను మనం శ్రవణం చేసేటప్పుడు ఆయన చేయమని చెప్పిన వాటిని మనం చేయటంలేదు. ఆయన వద్దని చెప్పిన పనులు మనం చేస్తున్నాము అని మనకు తెలుస్తూ ఉంటుంది. బుద్ధుడు ఏమని చెప్పాడు అంటే ఎద్దులు బండిని లాగుతూ ఉంటే ఎద్దుల వెనకాల బండి ఎలా వచ్చేస్తూ ఉంటుందో అలాగే నువ్వు భగవంతుడు వద్దని చెప్పిన పనులు చేస్తూ ఉంటే నీకూడా అశాంతి, దుఃఖం వచ్చేస్తాయి అని చెప్పాడు. శాస్త్రాన్ని ఊరికే చదివేయటం, కంఠతా పట్టేయటం కాదు. మీకు వివేకం ఉండాలి, వైరాగ్యం ఉండాలి. వివేకం, వైరాగ్యం లేకుండా మనకు అంతర్‌దృష్టి కలుగదు.

మన కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా లీల. భగవంతుడు చెప్పినట్లు మనం నడుచుకొంటే ఈ లీలలో కూడా నీ రోజులు బాగావెళ్ళిపోతాయి, బ్రహ్మంను పొందుతావు.

కర్మానుస్టానం అంటే భగవంతుడు ఏ పని అయితే చేయమని చెప్పాడో ఆ పని మీరు చేస్తూ ఉంటే అది కర్మానుష్టానం. జరిగిపోయిన గొడవలు అన్నీ వదిలేసి కనీసం ఇప్పటినుండి అయినా భగవంతుడు చెప్పినట్లు చేస్తున్నామా లేదా అని ఆలోచించుకొని పనిచెయ్యాలి, మనం బాగుపడేవిధానం చూసుకోవాలి. ఈ దేహానికి నీకు ఏమీ సంబంధం లేదు కానీ భగవంతుడు ఏమి చేసాడు అంటే నీకు దేహము నేను అనే బుద్ధిని పెట్టేసాడు. అక్కడ నుండి మనం బయటకు రాలేకపోతున్నాము, ఇది మహామాయ. అందుచేతనే భగవాన్ ఏమన్నారు అంటే అందరూ గజఈతగాళ్ళే గాని నీటిలోనికి దిగి ఈదండి అంటే గజం కూడా ఈదలేకపోతున్నారు అన్నారు. పెద్దపెద్ద పండితులు కూడా ఈ దేహము నేను అనే బుద్ధి దగ్గరే ఉంటున్నారు. దేహము నేను తలంపునుపెట్టుకొని నేను బ్రహ్మమును, నేను బ్రహ్మమును అని నువ్వు అనుకొంటే నిన్ను నీవు వంచన చేసుకోవటం, లోకాన్ని వంచన చేయటం. లోపల రోగం పెట్టుకొని నేను ఆరోగ్యముగా ఉన్నాను అంటే నిన్ను నీవు మోసం చేసుకోవటం, చివరకు ప్రమాదంలో పడతావు.

దేహము నేను అనే బుద్ధిని నీకు భగవంతుడు ఎందుకు పెట్టాడు అంటే ఈ దేహము నేను అనే బుద్ధిని పెట్టుకొని పూర్వంలో నీవు మంచికర్మలు చేసావు, చెడ్డకర్మలు చేసావు అందుచేత మరల దేహము నేను అనే బుద్ధితోటే నువ్వు వాటిని అనుభవించాలి, నువ్వు చేసిన కర్మలు నీకు అనుభవంలోనికి రావటానికి అది పెట్టాడు. నీ తెలివి వలన గాని, డబ్బువలన గాని, గౌరవాల వలన గాని దేహము నేను అనే బుద్ధిలో నుండి బయటకు రాలేవు. ఈశ్వరానుగ్రహం లేకుండా, సాధనలేకుండా, గురువు యొక్క దయలేకుండా అందులోనుండి నీవు బయటకు రాలేవు. రామకృష్ణుడు నరేన్‌తో అంటాడు చాలామంది నన్ను చూడటానికి వస్తున్నారు, కొంత మంది పిచ్చివాడు అంటున్నారు, కొంతమంది బీద బ్రాహ్మణుడు అంటున్నారు, కొంతమందిగుడిలో పనిచేసే పూజారి అంటున్నారు, ఏవో మంచిమాటలు చెపుతున్నాడు వినటానికి వస్తున్నాము అని కొంతమంది అంటున్నారు కాని నరేన్ నేను ఎవడినో నా తల్లితండ్రులకు తప్పించి ఈ లోకానికి తెలియదు అని చెప్పడు. రామకృష్ణుడు తండ్రి సత్యవాది, ఆయన ఆస్థిని అంతా వదులుకొంటాడు కాని ఒక్కమాట అబద్ధం చెప్పడు. ఆయన ఒకసారి గయ వెళ్ళి వారంరోజులు ఉన్నారు. అక్కడ మహావిష్ణువుని గదాధరుడు అంటారు. ఆయన రాత్రిళ్ళు అక్కడ గుడిలో నిద్రపోయేవాడు. ఒకరోజున స్వప్నంలో గదాధరుడు వచ్చి నాకు మీ ఇంటికి రావాలని ఉంది, నన్ను రమ్మంటావా అని అడిగాడు. అప్పుడు రామకృష్ణుడి తండ్రి ఏమని చెప్పాడు అంటే నువ్వు మా ఇంటికి రావద్దు, మేము తాటాకు ఇంటిలో ఉంటున్నాము, ఒకపూట అన్నంతింటే రెండోపూట

లేకుండా బాధపడుతున్నాము. నువ్వు మహావిష్ణువు, నిన్ను ఏదో దశరధుడు పోషించాడు గాని నేనెక్కడ పోషించగలను, నువ్వు మా ఇంటికి రావద్దు అని చెప్పాడు. నువ్వు వద్దన్నా నాకు రావాలని ఉంది అంటాడు మహావిష్ణువు. రావద్దని ఈయన చెప్పటం మానటంలేదు, వస్తాను అని ఆయన అనటం మానటంలేదు అలా స్వప్నం అయిపోయింది. తరువాత 5 సంవత్సరాలకు రామకృష్ణుడు పుట్టాడు రామకృష్ణుడు నరేన్‌తో ఏమన్నాడు అంటే ఈ శరీరంలో ఉన్నది ఎవడో నా తల్లితండ్రులకు తప్పించి లోకానికి తెలియదు, ఒరేయ్ బుల్లినరేన్ అది నువ్వు ఎంతోకొంత పట్టుకొంటున్నావు నీ పూర్వపుణ్యం బాగుంది. నేను బీదబ్రాహ్మణుడిని అని చెప్పినా నువ్వు నా పాదాలను విడిచిపెట్టటం లేదు అన్నాడు రామకృష్ణుడు.

మనం శివుడిని అయినా, కేశవుడిని అయినా ఎందుకు ఆరాధిస్తాము అంటే వారిని ధ్యానంచేసి, ఉపాసనచేసి, వారిపట్ల భక్తి భావం పెంచుకొంటూ ఉంటే, వారి పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే మనలో ఉన్న చైతన్యశక్తి మేల్కొంటుంది, అది మనలో ఉన్న చెడ్డను బయటకు గెంటేస్తుంది, అది ఉపాసన యొక్క లక్ష్యం. మీరు మహర్షులతోటి, మహాత్ములతోటి సాంగత్యం చేస్తారు అనుకోండి మీరు చెడ్డగుణాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయనక్కరలేదు, వాటి అంతట అవే రాలిపోతాయి. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, అన్ని కాలాలలో ఉన్నాడు, వాడు లేనిచోటు లేదు, వాడు లేనికాలం లేదు. మనకు భగవదనుభవం కలిగేవరకూ ఏది వచ్చినా నమ్మటానికి వీలులేదు. మీకు అదృష్టం వచ్చి పడిపోతుంది అనుకోండి, అదీ ఉండదు, ఎప్పుడైనా దరిద్రం వచ్చిమీద పడినా అదీ నిలబడదు, కర్మానుసారం ఏ కాలంలో ఏది రావాలో అది వస్తుంది, దానిని మీచేత అనుభవింపజేస్తాడు, తరువాత అది పోతుంది, పూర్వజన్మలలో మీరు పుణ్యకర్మ చేసారు అనుకోండి, దాని ఫలితం అనుభవించకుండా ఈ భూమిమీద నుండి బయటకు వెళ్ళనివ్వడు. శివరాత్రి రోజున ఉపవాసం చేస్తారు, జాగరణం చేస్తారు. శివరాత్రిరోజున కొంతమంది ఏమి తినకుండా ఉంటారు. కొంతమంది ఎంత కఠినమైన నిష్టలో ఉంటారు అంటే నిర్జల ఉపవాసం చేస్తారు అంటే అసలు మంచినీరుకూడా తాగరు. ఉపవాసం అంటే సమీపంగా ఉండటం అంటే భగవంతుడికి సమీపంగా ఉండాలి. జాగరణ మీరు శివస్మరణతో చేయాలి. చదువుకొనేపిల్లలు నిద్రచెడగొట్టుకొంటున్నాము అనే భావన లేకుండా రాత్రి అంతా ఎలా చదువుతారో అలాగ శివస్మరణలో మునిగిపోవాలి, ధ్యానంలో మునిగిపోయి జాగరణ చేయాలి. ఉపయోగం లేని మాటలు చెప్పకొంటూ రాత్రి అంతా కాలక్షేపం చేస్తారు, అలాకాదు. ఆరోజు విషయచింతన

ఉండకూడదు, అంతా శివస్మరణలో ఉండాలి.

ఆచార్యులవారు ఏమన్నారు అంటే నేను ఇంటిలో ఉండవచ్చు, హిమాలయపర్వతాలలో ఉండవచ్చు, ఏదైనా ప్రయాణంలో ఉండవచ్చు. నా శరీరం ఎక్కడ ఉంటే ఏముంది, నా మనస్సుమటుకు ఎప్పుడూ నీ పాదాలమీద నిలబడి ఉండాలి అని శివానందలహరిలో వ్రాసారు. ఆ పని మనం కనీసం శివరాత్రిరోజున అయినా చేయలేము. మనిషి శరీరంతో చాలా తక్కువ తప్పులు చేస్తాడు, ఎక్కువ తప్పులు, ఎక్కువ పాపాలు మనస్సుతోటే చేస్తాడు అని శాస్త్రంలో చెప్పాడు. మిమ్మల్ని చూసి నేను అసూయపడుతున్నాను అనుకోండి, ఇక్కడ శరీరం అసూయపడటంలేదు, మనస్సు అసూయపడుతోంది. అంటే తప్పు ఎవరు చేస్తున్నారు? శరీరం చేయటంలేదు, మనస్సే తప్పు చేస్తోంది. ఏసుక్రీస్తు ఏమన్నాడు అంటే నీ కళ్ళు తప్పు చేస్తూ ఉంటే, తప్పు చెయ్యవద్దని నీ కళ్ళకు చెప్పు. నువ్వు చెప్పినా కళ్ళు వినకపోతే వాటిని పీకి అవతల పారెయ్యి, ఎందుచేతనంటే శరీరం చనిపోయాక శాశ్వతంగా నరకంలో ఉండటంకంటే ఇప్పుడు బతికిన కొద్దిరోజులు గుడ్డివాడిగా ఉండటం మేలు అన్నాడు. శివుడి మెడలో పాములు, కంఠంలో విషం, కట్టుకొనేది పులిచర్మం అయినా, మీరు మంచి బట్టలు కట్టుకొని, మెడలో బంగారపు వస్తువులు వేసుకొని ఆయన దగ్గరకు వెళితే ఆయన సంతోషిస్తాడు. నేను పాములు వేసుకొన్నాను, వీరు బంగారపు వస్తువులు వేసుకొన్నారు అని అనుకోడు, మిమ్మల్ని చూసి సంతోషిస్తాడు. మనకు లేనిది ఇతరులకు ఉంటే మనం చూసి ఆనందించం సరికదా వారిని ద్వేషిస్తాము. కాని శివుడు మిమ్మల్ని చూసి ద్వేషించడు, మీకు ఉన్నందుకు ఆయన ఆనందిస్తాడు, వాడు శివుడు. నామం వలన, ఉపాసనవలన మీకు అనుబంధం కలుగుతుంది. మీ మనస్సుతో ఈశ్వరుడితోటి అనుబంధం పెట్టుకొంటే మీరు పవిత్రులు అవుతారు. ఈశ్వరుడిని స్మరించుకొంటూ ఉంటే ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ ఉంటే మీకు స్పష్టంగా ఆయన అనుగ్రహం తాలుక స్పర్శ లోపల తెలుస్తూ ఉంటుంది, ఆయన అనుగ్రహం వచ్చి మీ హృదయాన్ని తాకినప్పుడు ఇది నాది కాదు, ఆయన అనుగ్రహం అని మీకు స్పష్టంగా తెలుస్తుంది. అప్పుడు మీరు పొందేసుఖం లౌకికసుఖాల వంటిది కాదు. అది ఒక కెరటం కింద వచ్చి మీ మీదపడుతుంది. అప్పుడు సుఖాన్ని మీరు పొందటంకాదు, ఆ సుఖమే మీరు అయిపోతారు.

నువ్వు లోపలచెడ్డ ఉద్దేశాలు పెట్టుకొని నోటితో అందంగా మాట్లాడుతూ ఉంటే నిన్ను నీవు మోసం చేసుకొంటున్నావు అన్న సంగతి నీకు తెలియటంలేదా? మనస్సు ఈశ్వరుడిని చింతిస్తోంది అనుకోండి, దానిని భక్తి, ప్రేమ అంటారు. అదే మనస్సు విషయాలను చింతిస్తోంది

అనుకోండి, దానిని కామం అంటారు. ఆ పనిచేసేది మనస్సే, ఈ పని చేసేదే మనస్సే. విషయచింతన వలన మనస్సు పాడైపోతుంది, భక్తి వలన మనస్సు పవిత్రమవుతుంది. అందుచేత నీ మనస్సును అటు తిప్పేబదులు ఇటు తిప్పు. మనం నేను, నేను అంటాము. నేను అనేది కూడా ఒక తలంపు. ఇది ప్రధమ తలంపు. ఇది వచ్చాక అనేక తలంపులు వస్తున్నాయి. ఈ నేను ఎవరు? అది ఎక్కడినుండి వస్తోంది అని దానిని ఎవరు విచారణ చేయటం లేదు. శరీరం అన్నం తింటోంది. ఈ నేనుకు రూపం, నామం ఆహారం. ఇది రూపాన్ని, నామాన్ని పట్టుకొని బతుకుతుంది. సంసారం అంటే ఇంట్లో మనుషులు సంసారం కాదు, ఈ నేను సంసారం. ఈ నేనుకు అనుకూలంగా మీ కోడలు ఉంది అనుకోండి, మీతోపాటు ఉండమంటారు లేకపోతే బయటకు పొమ్మంటారు. అక్కడ మీ కోడలు ముఖ్యం కాదు, ఈ నేనే ముఖ్యం. మనం ఏ పనిచేసినా ఈ నేనే కేంద్రంగా ఉంటుంది. ఈ నేనుకు అనుకూలంగా ఉంటే మీరందరూ మంచివాళ్ళే. ఒకవేళ మీరు నిజంగా మంచివారు అయినా ఈ నేనుకు అనుకూలంగా లేకపోతే మీరు చెడ్డవారు అంటుంది. అటువంటి నేనును పట్టుకొని జన్మజన్మల నుండి తిరుగుతున్నాము. ఇది ఒక పిశాచం, ఇదే సైతాను, అది మనలను వైకుంఠానికి వెళ్ళనివ్వదు. మనం ఏ నేనును అయితే పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నామో, ఆ నేనును జారిపోకుండా కొంచెం అట్టేపెట్టుకొంటున్నాను అన్నాడు రామకృష్ణుడు. అది లేకపోతే మీకు బోధించే వాడు ఇంక కనబడడు. ఇవన్నీ ఎందుకంటే మానవజాతి మీద వారికి ఉన్న ప్రేమ. వారిమాట అనుగ్రహం, అవి మాటలు కాదు, మాట రూపంలో ఉన్న అనుగ్రహం.

దేవుడి రూపంకంటే నామం ప్రధానం. ముందు మీరు ప్రయత్నంతో జపం చేయాలి. తరువాత అది సహజమైపోతుంది. అంతవరకు మనం సాధన చెయ్యాలి. పగలు మీరు నామస్మరణ బాగా ప్రాక్టీసు చేస్తారు అనుకోండి, రాత్రి మీరు నిద్రపోతూ ఉంటారు, లోపల హృదయంలో ఆ చింతన జరిగిపోతూ ఉంటుంది. అంటే నిద్ర టైము మనకు ఉపయోగ పడుతోంది. అలా స్మరించగా స్మరించగా ఆ దైవం ఎంత పవిత్రుడో మీ హృదయం కూడా అంత పవిత్రమవుతుంది. హృదయ శుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు. చేతులతో పనిచేస్తూ ఉండు, కాళ్ళతో నడుస్తూ ఉండు, మనస్సుతో మటుకు ఈశ్వరుడిని స్మరించుకో. నువ్వు వంద సంవత్సరాలు బతికితే వంద సంవత్సరాలలో చేతులతోటి ఒక మంచి పని కూడా చేయలేకపోతే ఆ చేతులను ఏమి చేసుకొంటావు అంటాడు టాగూర్. నీ మనస్సు ఏదో ఒకటి స్మరించకుండా ఉండలేదు. ఒకవేళ నీవు భగవంతుడిని స్మరించటం మానేస్తే విషయాలలోనికి

వెళ్ళిపోతూ ఉంటుంది. అందుచేత మనస్సుకు భగవంతుడి స్మరణ అలవాటు చేసెయ్యి. భగవంతుడిని స్మరించటం వలన ఆయనతో చుట్టరికం కలుస్తుంది. మనకు నిజమైన బంధువు భగవంతుడే. స్మరణ వలన ఆయన పట్ల ప్రేమ కలుగుతుంది. మీరు మంచి విషయాలను ఆలోచిస్తూ ఉంటే, ఈశ్వరుడి గురించి ఆలోచిస్తూ ఉంటే అది కూడా తపస్సే. ఇంట్లో ఏదైనా కష్టం వచ్చినా అది భరించగలుగుతారు అనుకోండి, అది కూడా తపస్సే. తపస్సు అంటే ఎక్కడికో పారిపోయి కూర్చోవటంకాదు మీ ప్రారబ్దం కొట్టే దెబ్బలను భరించటం కూడా తపస్సే. ప్రారబ్దాన్ని మీరు ఇష్టంతో అనుభవిస్తూ ఉంటే అటువంటి ప్రారబ్దాన్ని ఇంక భగవంతుడు వచ్చే జన్మలో రానివ్వడు. ప్రారబ్దాన్ని మీరు ఎలాగైనా అనుభవించాలి అందుచేత దానిని ఇష్టంతో అనుభవించండి. మీరు చేయవలసిన సాధన ఏమిటి అంటే మీ లోపల ఏదో దేహంతో ఏకం అవుతోంది అని మీకు తెలుస్తూ ఉంటుంది. ఆ ఏకమయ్యే దానిని విడదీసి, దేహానికి సంబంధించిన స్మరణ ఆపేసి దైవస్మరణ చేయాలి. అలా దైవ స్మరణ చేయగా చేయగా, ఆత్మస్మరణ చేయగా చేయగా మీకు ఆత్మబుద్ధి కలుగుతుంది, దేహబుద్ధి కరిగిపోతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-02-2009, గణపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మౌనం బంగారం, ఈ శబ్దాలు రాగి, వెండి. మౌనం మిమ్మల్ని హృదయంలోనికి తీసుకొని వెళ్ళినంత వేగంగా శబ్దం తీసుకొని వెళ్ళదు. కాని మౌనం అంటే మీకు ఇష్టం ఉండదు, శబ్దం అంటే ఇష్టపడతారు. మనం అలా అలవాటు పడిపోయాము. మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటంకాదు. మనస్సు ఎక్కడైతే అణిగిపోయిందో అక్కడ నుండి మౌనం వస్తుంది. ఆ మౌనం బోధించినట్లు శబ్దం బోధించలేదు. మనం ఇతరులను ద్వేషిస్తాము కాని మనలను మనం ద్వేషించుకోము. నన్ను నేను ప్రేమించుకొంటాను కాని, నేను మిమ్మల్ని ప్రేమించలేను. మనందరం ఒక్కటే అన్న సంగతి తెలియక ఇవన్నీ వస్తున్నాయి. రూపాలు తేడా, రంగులు తేడా, గుణాలు తేడా కాని లోపలఉన్న పరమార్ధం ఒక్కటే. ఇన్ని రూపాలు ధరించినవాడు భగవంతుడే. ఆయన సంకల్పం లేకుండా అసలు రూపం రాదు. మీరూ, మేము ఒక్కటే అన్న సంగతి తెలియకపోవటం వలన ద్వేషించటం జరుగుతోంది. మనందరం ఒక్కటే కాని అది మనకు అనుభవంలో లేదు. అందరం ఒక్కటే అని మనకు తెలిసేవరకూ అంటే అభేదస్థితి పొందేవరకు ప్రతీవాడు శవాలను మోస్తూ ఉండవలసిందే, పునర్జన్మలు రాకుండా ఎవడూ